# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 225 | విశాఖపట్నం | 16-5-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 225 | VISAKHAPATNAM | 16-5-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay





దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 పెంపు (2లో)

## చివరి దశలో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు



(5లో)



(6లో)

వేసవిలో ఎక్కువగా వచ్చే కడుపు ఉబ్బరం సమస్య తగ్గాలంటే..!



# శివయ్య.. నీ త్రిశూలం ఖర్చు ఎంతయ్యా!

- కైలాసగిరి కొండపై త్రిశూలం ప్రాజెక్టు వ్యయంలో తజ్జనభర్జనలు!
- ఎంపీ ఒకలా మాట్లాడుతూ.. మంత్రి ఇంకోలా మాటలు చెబుతూ ఉంటే అధికారులు తలపట్టుకున్నారా?
- వీఎంఆర్‌డీఏ, అధికారులు పాత్రపై సందేహాలు మొదలయ్యాయా!!
- నిధులు దారి మళ్లింపు చేసి పారదర్శకతపై ప్రశ్నలు..!!
- ఎంపీ, మంత్రి మాటలు మార్చడం వెనక మర్మం ఏమిటో..
- రూ.1.50 కోట్ల నుంచి రూ.6 కోట్లు ఖర్చు అయిపోతుందా? నమ్మే మాటలేనా!!
- దుబారా ఖర్చు ఎందుకు చేస్తున్నారో...!
- ఎవరు తీర్మానం చేశారని త్రిశూలం పెట్టారు!!!
- ప్రజలు కడుతున్న పన్నులు రక్తాన్ని పిండిస్తున్న అధికారులు
- దుబార ఖర్చు చేయమని చెప్పి అందలం ఎక్కించారా ప్రజలు
- శివయ్య తలుచుకుంటే నరకమే తెలిసి తప్పు చేసిన వారికి....

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆధ్యాత్మిక పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కైలాసగిరి... సదాశివుడు మంత్రాలు కంటే అవినీతి ఆరోపణలతో మార్మోగిపోతుంది. నూతనంగా ప్రారంభమైన త్రిశూలం. డమరుకం ప్రాజెక్టు భక్తి కంటే భుక్తి ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. శివయ్య పేరు చెప్పుకొని అబద్ధాలు చేస్తూ మోసాలు చేస్తే శివయ్య ఊరుకుంటాడా అసలు వదలడు.. శివయ్య ఆయుధాలను ప్రతిష్ఠించిన వేళ పారదర్శకతను పాత్ర వేస్తూ నిధులు గోలుమాలపై పర్యటకలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభములో అంచనా వేసిన వ్యయానికి ప్రస్తుతం ప్రకటనలకు పొంతన లేకపోవటమే కాకుండా,,సాక్షాత్తు అధికారపక్ష నేతలే పరస్పర విరుద్ధమైన అంకెలు గారడీలతోటి వల్లే వేయటం ఈ ప్రాజెక్టు చుట్టూ ఉన్న అక్రమాలు చుక్కముడిని విప్పి చెబుతుంది. శివయ్య పేరు చెప్పుకొని (తరువాయి 4వ పేజీలో)

## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, డ్రోన్ తయారీ రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా మరో ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నేడు సుమారు రూ. 2,959 కోట్ల విలువైన మూడు కీలక డిఫెన్స్ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్‌సీఎల్ సంస్థలు ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నాయి. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1,935 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. వీటితో పాటు, పుట్టపర్తిలో ఏర్పాటు చేయనున్న "డ్రోన్ సిటీ"లో పలు డ్రోన్ తయారీ పరిశ్రమలకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్ పాల్గొన్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ ప్రాజెక్టులతో పుట్టపర్తి ప్రాంతం రక్షణ, ఏరోస్పేస్ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించుకోనుంది. శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. (తరువాయి 2వ పేజీలో)

## యూఏఈ పర్యటనలో మోడీ.. కీలక ఒప్పందాలపై సంతకాలు



**యూఏఈ:** పశ్చిమాసియాలో నెల కొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగ స్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

## ఏపీకి ఏఎంసీఏ ప్రాజెక్టు కీలకమైన మైలురాయి: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ. 15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ. 15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ & ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు' అని పవన్ అభివర్ణించారు

## గుంటూరు జిల్లాలో ఫుడ్ పాయిజన్ కలకలం.. 50 మందికి అస్వస్థత




**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు జిల్లాలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో జరిగిన ఈ ఘటనలో దాదాపు 50 మంది గ్రామస్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఉన్న బేతస్థ ప్రార్థనా మందిరంలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భోజన వసతులు కల్పించారు. మిగిలిపోయిన ఆహారాన్ని (తరువాయి 3వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఘంటికలు..

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కొంత కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును కళ్లకు కడతాయి. రోజుల తరబడి స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై ఆందోళనకర దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. మంగళవారం నాడు స్టాక్‌మార్కెట్ సెన్సెక్స్ ఒక్కరోజులోనే 1,456 పాయింట్లు కుప్పకూలి, 11 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం ఈ పరిణామాల కొనసాగింపే. ఇది మదుపరులలో నెలకొన్న విశ్వాస సంక్షోభాన్ని బట్టబయలు చేసింది. అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాలపై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి.


ఈ ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేస్తుండటం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్ధనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్ధనీయం కాదు. ప్రత్యక్షంగా పెంచకపోయినప్పటికీ, రకరకాల విన్యాసాలతో ప్రజల మూలుగులను ఇప్పటికే పీల్చి పిప్పిచేసిన సంగతిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కొనుగోలును ఏడాదిపాటు నిలిపివేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపే చర్యే! 2026 సంవత్సరానికి భారత జిడిపి వృద్ధి అంచనాను మూడీస్ 6.5 శాతం నుండి 6.3 శాతానికి తగ్గించడం యాదృచ్ఛికం కాదు. దేశీయ వినియోగం మందగించడం, తయారీ రంగం ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అయినా, సంపన్నులకు రాయితీలు ఇచ్చి, సామాన్యులపై భారాలు మోపే విధానాలు కొనసాగిస్తూ నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్-మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తోంది. ఇప్పటికైనా, ప్రభుత్వం ప్రజాకేంద్రిత ఆర్థిక విధానాలకు మరలాలి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. లేని పక్షంలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయం.

## దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 పెంపు





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా వాహనదారులకు భారీ షాక్ తగిలింది. పెట్రోల్, డీజిల్ ధరలను చమురు మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం నుంచి భారీగా పెంచాయి. లీటర్‌కు సుమారు రూ.3 మేర ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ కొత్త ధరలు నేటి (శుక్రవారం) ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ పెంపుతో రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.94.77 నుంచి రూ.97.77కు చేరగా, డీజిల్ ధర రూ.87.67 నుంచి రూ.90.67కు పెరిగింది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరలు భారీగా పెరిగాయి. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.74, ముంబైలో రూ.106.68, చెన్నైలో రూ.103.67కు చేరింది. అదేవిధంగా డీజిల్ ధరలు కోల్‌కతాలో రూ.95.13, ముంబైలో రూ.93.14, చెన్నైలో రూ.95.25కి చేరాయి. నగరాలను బట్టి ఈ పెంపు రూ.2.83 నుంచి రూ.3.29 వరకు ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత చమురు ధరలను ఈ స్థాయిలో సవరించడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రపంచ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 105 డాలర్ల మార్కును దాటడంతో, దాని భారాన్ని తగ్గించుకునేందుకు చమురు సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మీదుగా జరిగే ఇంధన రవాణాకు ఎదురవుతున్న సవాళ్లపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. బ్రెంట్ క్రూడ్ ధర 105 డాలర్లు దాటితే మే 15 తర్వాత ధరలు పెరిగే అవకాశం ఉందని ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ మనోరంజన్ శర్మ ముందే అంచనా వేసిన విషయం తెలిసిందే. తాజా పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్': రాజ్ నాథ్ సింగ్



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను దేశ రక్షణ రంగ పటంలో అగ్రస్థానంలో నిలుపుతూ, రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రక అధ్యాయానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనంతపురం జిల్లా పుట్టపర్తి వేదికగా శుక్రవారం వేల కోట్ల రూపాయల విలువైన నాలుగు కీలక రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, పాలనా సామర్థ్యంపై ప్రశంసల వర్షం కురిపించారు. "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో నాయకులను చూశాను. కానీ, టెక్నాలజీ పట్ల చంద్రబాబుకు ఉన్న పట్టు, అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, భవిష్యత్తును అంచనా వేయగల ఆయన దూరదృష్టి చాలా అరుదుగా కనిపిస్తుంది. ఆయన ఆలోచనలు ఎప్పుడూ చిన్నవిగా ఉండవు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషికి కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా ప్రశంసలు దక్కాయి" అని కొనియాడారు. గూగుల్ వంటి బహుళజాతి సంస్థ తన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఏపీని ఎంచుకోవడమే చంద్రబాబు సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. "చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'గా ఎదుగుతుందన్న పూర్తి విశ్వాసం నాకుంది" అని రాజ్ నాథ్ ధీమా వ్యక్తం చేశారు. పుట్టపర్తిలో ప్రారంభమైన ప్రాజెక్టుల వివరాలను రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు భారత సైన్యం, వాయుసేన, నౌకాదళం.. ఇలా త్రివిధ దళాల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని వివరించారు.

## నీట్ విద్యార్థి రితిక్ ఆత్మహత్యకు బాధ్యులెవరు?: ప్రియాంక గాంధీ



**ఉత్తరప్రదేశ్, పతాకం న్యూస్:** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుతో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. పరీక్ష రద్దుతో తీవ్ర మానసిక వేదనకు గురైన రితిక్ బలవన్మరణానికి పాల్పడినట్లు బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ప్రతిపక్ష పార్టీలు, పలువురు రాజకీయ ప్రముఖులు స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రితిక్ మృతిపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీలో నీట్ విద్యార్థి రితిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకోవడం అత్యంత హృదయ విదారకమని ప్రియాంక గాంధీ అన్నారు. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నీట్ పరీక్ష రద్దు కావడంతో రితిక్ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారని ప్రియాంక అన్నారు. పరీక్షల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతి యువత ప్రాణాలను బలి తీసుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని మండిపడ్డారు. ఈ పేపర్ లీక్‌ల పరంపర ఎప్పుడు ఆగుతుంది? అంటూ ప్రశ్నించారు. దీనికి ఎవరు జవాబుదారీతనం వహిస్తారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. కాగా, నీట్ పరీక్ష రద్దుతో తీవ్ర ఆవేదనకు గురైన యూపీకి చెందిన రితిక్ మిశ్రా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇప్పటికే రెండు సార్లు నీట్ రాసిన విద్యార్థికి సీటు రాలేదు. మూడోసారి అయినా సీటు వస్తుందని భావించిన యువకుడికి పరీక్ష రద్దు షాక్ ఇచ్చినట్లు అయ్యింది. దీంతో అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## జూన్ 21న మళ్లీ నీట్ పరీక్ష: ఎన్‌టీఏ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నా పత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరంగానీ లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సిబిఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతోపాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

(మొదటిపేజీ తరువాయి)

## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమి పూజ

ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది. పుట్టపర్తి ఇకపై ఆధ్యాత్మిక స్ఫూర్తి నుంచి వ్యూహాత్మక ఆవిష్కరణల కేంద్రంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఆంకా' ప్రాజెక్టు ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి అవుతుందని ఆయన తెలిపారు. ప్రాథమికంగా రూ.15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తొలిదశలో 7,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసిన వేగాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమని అన్నారు. "ఈ ఏడాది 9వ తేదీన రక్షణ శాఖలో చర్చలు మొదలైతే, 20న ప్రతిపాదనలు అడిగారు. 24న మేం పంపాం, 28న కేంద్రం అంగీకరించింది. 29న అధికారులు స్థలాన్ని పరిశీలించి, 30న రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. జెట్ స్పీడ్‌తో ఫైటర్ జెట్ ప్రాజెక్టును సాధించాం" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర పోషించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'ఆమ్కా' ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఇతర రక్షణ, అనుబంధ పరిశ్రమల గురించి కూడా సీఎం ప్రస్తావించారు. మడకశిరలో భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, దోనకొండలో బీడీఎల్ సంస్థలు రూ.2,959 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని, దీనివల్ల 4-5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ద్వారా దేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకోసిస్టమ్‌కు శ్రీకారం చుట్టామని, రూ.686 కోట్ల పెట్టుబడులతో 8 సంస్థలు వస్తున్నాయని, తద్వారా 2,500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. శ్రీహరికోట నుంచి అంతరిక్ష శక్తి, నాగాయలంక నుంచి క్షిపణి శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తి, ఇప్పుడు పుట్టపర్తి నుంచి వైమానిక శక్తితో ఆంధ్రప్రదేశ్ దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. గతంలో కరవు సీమగా, రాళ్ల సీమగా పిలవబడిన రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో వీధుల్లో రత్నాలు రాశులుగా పోసి అమ్మిన ఈ గడ్డను మళ్లీ రత్నాల సీమగా మార్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది" అని ఆయన అన్నారు. పెనుకొండలో కియా పరిశ్రమ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, కరువు సీమలో తయారైన కార్లు నేడు 80 దేశాల్లో తిరుగుతున్నాయని గుర్తుచేశారు. కడప స్టీల్ ప్లాంట్‌ను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ (జీ+ఖీ) ద్వారా త్వరలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను కూడా తీసుకువస్తామని చెప్పారు. రాయలసీమ అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టులే పునాది అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన హంద్రీనీవా, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే కియా మోటార్స్ రాగలిగిందని గుర్తుచేశారు. సమర్థవంతమైన నీటి నిర్వహణతో నేడు మే నెలలో కూడా పుట్టపర్తి చెరువు నిండుగా ఉందని, ఇది సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్టీల్, సిమెంట్ పరిశ్రమలను, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించి సీమ దశ మారుస్తామని భరోసా ఇచ్చారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను తరిమేసి, క్రిమినల్ రాజకీయాలు చేశారని విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రానికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చంద్రబాబు చెప్పారు.

# 50వేల మెట్రిక్ టన్నుల కాఫీ దిగుబడి లక్ష్యం




**అరకులోయ, పతాకం న్యూస్:** వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి కాఫీ దిగుబడి 50 వేల మెట్రిక్ టన్నులకు చేరడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జాతీయ కాఫీ బోర్డు ఛైర్మన్ ఎంజే దినేష్ ప్రకటించారు. తద్వారా మూడు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఆర్‌వీ.నగర్‌లో కాఫీ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీజనల్ కాఫీ రీసెర్చ్ స్టేషన్ 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా అరకులోయ టూరిజం గోష్ఠి ఆడిటోరియంలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను జాతీయ కాఫీ బోర్డు ఛైర్మన్ ఎంజే దినేష్, సీఈవో ఎం.కూర్మారావు, జిల్లా కలెక్టర్ నిషాంతి, కాఫీ బోర్డు ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. అనంతరం కాఫీ బోర్డు ఛైర్మన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 2.5 లక్షల మంది కాఫీ రైతులున్నారని, 1,12,000 హెక్టార్లలో ఉన్న కాఫీ తోటల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల కాఫీ మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. కాఫీ తోటలకు తగ్గట్టుగా దిగుబడి సాధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి 50 వేల మెట్రిక్ టన్నుల కాఫీ దిగుబడి చేసి కనీసం మూడు కోట్ల లక్షల టర్నోవర్ సాధించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రొడక్షన్, ప్రోసెసింగ్, ప్రైస్ (త్రి పీ)లను పాటిస్తామన్నారు. ఇందులో కాఫీ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు, ఎన్జీవోలు, ఎఫ్‌పీవోలతో సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాఫీ బోర్డు కార్యదర్శి, సీఈవో ఎం.కూర్మారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చారన్నారు. కాఫీ తోటల విస్తీర్ణం, దిగుబడులు గణనీయంగా పెంచాలని, కాఫీ రైతుల ఆర్థిక సుస్థిరత సాధించాలని లక్ష్యంగా ఉన్నారన్నారు. ఎక్కువ దిగుబడినిచ్చే సురక్ష, శతాబ్ది అనే మేలు రకాల కాఫీ మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాఫీ బోర్డు రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున కాఫీ తోటలున్నప్పటికీ దిగుబడులు రావడం లేదని, ఇతర రాష్ట్రాలు, దేశాలతో పోలిస్తే అల్లూరి జిల్లాలో అధిక దిగుబడులు సాధించలేకపోతున్నామన్నారు. ఎకరాకు 75 కిలోలు వస్తున్న ఇదే తోటల్లో కనీసం 150 నుంచి 200 కిలోల సాధించేందుకు కాఫీ బోర్డు కృషి చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు కాఫీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, తమకు లక్ష్యాలను నిర్దేశించారన్నారు.

# సింహాచలం దేవస్థానానికి ట్రస్ట్ బోర్డు



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ప్రభుత్వం ట్రస్ట్ బోర్డును నియమిస్తూఉత్తర్వులు జారీచేసింది. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజును ఛైర్మన్‌గా, మరో 16 మందిని సభ్యులుగా నియమించింది. ఈ ప్రక్రియలో ప్రభుత్వం జిల్లాలో అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి కూడా అవకాశం కల్పించింది. కేవలం నియోజకవర్గం, స్థానికులని కాకుండా, టీటీడీ బోర్డులా సేవ చేయాలని ఆకాంక్షించిన వారికి అవకాశం కల్పించింది. అదే సమయంలో కూటమిలో పార్టీలకు కూడా తగిన ప్రాధాన్యం ఇచ్చింది. ఈ పదవుల్లో ఉత్తరాంధ్ర వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సభ్యులుగా మక్కెన సీతారాం పాత్రుడు (ఎస్.కోట–టీడీపీ), కశిరెడ్డి దామోదర్ (భీమిలి –టీడీపీ), చలమూరి భారతి (భీమిలి–టీడీపీ), కరక దేవుడు (పెందుర్తి–టీడీపీ), కనకాల మురళీమోహన్ (విజయనగరం–టీడీపీ), వేంపాడడపు అన్నపూర్ణ (చీపురుపల్లి–టీడీపీ), జీతల నీరజ లక్ష్మీకుమారి (అరకులోయ–టీడీపీ), సుసరపు గణపతిరావు (టెక్కలి–టీడీపీ), చల్లంగి జ్ఞానేశ్వరి (పాడేరు–టీడీపీ), పావులూరి శ్రీనివాసరావు (అనపర్తి–టీడీపీ), మధుపాడ సన్యాసిరావు (విశాఖ–బీజేపీ), డా.శ్రీధరి బండ్ల (నరసరావుపేట–టీడీపీ), నీటిపల్లి మహేశ్ (పెందుర్తి–జనసేన), పెద్దిశెట్టి ఉషశ్రీ (విశాఖ–జనసేన), లలిత జ్యోతి (పుంగనూరు–టీడీపీ), గుత్తికొండ శ్రీలత (విశాఖ ఉత్తరం–టీడీపీ)కు అవకాశం కల్పించారు. ఇటీవల వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి ట్రస్ట్ బోర్డును నియమించిన సంగతి తెలిసిందే. ఆలయం దక్షిణ నియోజకవర్గంలో ఉంది కాబట్టి తామే ట్రస్ట్ బోర్డు సభ్యులను ఎంపిక చేసుకుంటామని అక్కడి కూటమి నాయకులు పట్టుబట్టారు. అయితే జిల్లా పార్టీ నాయకులు దీనిని సున్నితంగా తిరస్కరించారు. అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజలందరికీ ఇలవేలుపు కాబట్టి అందరికీ అవకాశం కల్పించాలని, ఆ నియోజకవర్గానికి పరిమితంగా కొందరిని మాత్రమే ఎంపిక చేసి, జిల్లాలో మిగిలిన వారికి అవకాశం కల్పించారు. ఈ విధానాన్ని అన్ని పార్టీలు హర్షిస్తున్నాయి. పార్టీలకు సేవ చేసిన వారిని గుర్తించి పదవులు ఇచ్చినందుకు వారంతా సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

# స్టీల్‌ప్లాంట్‌లో దారుణంగా మారిన కోక్‌ఓవెన్ బ్యాటరీలు!

## నిర్వహణ పట్టించుకోని అధికారులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కోక్ ఓవెన్ బ్యాటరీల పరిస్థితి ఏమీ బాగా లేదు. మొత్తం ఐదు కోక్ ఓవెన్ బ్యాటరీలు ఉండగా వాటిలో మూడు శిథిలావస్థకు చేరాయి. ఉన్నవాటినే మరమ్మతులు చేసి నడిపిస్తున్నారు. అనుభవం ఉన్న కాంట్రాక్టు సిబ్బందిని తొలగించడంతో వాటి నిర్వహణ కష్టతరంగా మారింది. పైన ఎక్కడెక్కడో పైపులైన్లు పగిలి నీరు బ్యాటరీలపైన పడుతోంది. వాటిని గుర్తించి సరిచేయడానికి చాలా సమయం పడుతోంది. మరోవైపు కోక్‌ఓవెన్లకు అవసరమైన కోక్‌ను లోకో (రైళ్లలో)లో తరలిస్తారు. ఆ రైలుమార్గం కూడా వ్యర్థాలతో నిండిపోయి లోకోలు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా 100 శాతం పుషింగ్‌లు తీయలేదని ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్నారు. సమస్య పరిష్కరించే క్రమంలో కొంత సమయం మరమ్మతులకు వెచ్చించాల్సి ఉంటుందని చెప్పినా వినిపించుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పుడైనా నిర్వహణ పనులకు తగినంత సిబ్బందిని కేటాయించాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

# 17న వార్డుల విభజన ముసాయిదా ప్రతిపాదన



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** పురపాలక సంఘం వార్డుల విభజన ముసాయిదా ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మునిసిపాలిటీలో 61,540 మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వ జీవో ఎంఎస్ 64 ప్రకారం 60 వేల నుంచి 80 వేలలోపు జనాభా ఉంటే 40 వార్డులు చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఉన్న 28 వార్డులు 40 వార్డులకు పెరిగింది. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది సర్వే చేసి జనాభా, ఓటర్ల ఆధారంగా వార్డుల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేశారు. గత నెలలోనే ముసాయిదా ప్రతిపాదన ప్రకటించాల్సి ఉండగా జనగణన కారణంగా ప్రభుత్వం గడువు పెంచింది. ఈ నెల 17న వార్డుల విభజన ముసాయిదా ప్రతిపాదనను మునిసిపల్ అధికారులు ప్రకటించబోతున్నారు. 18 నుంచి 24 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడానికి ఏడు రోజులు గడువు ఇచ్చారు. గడువులోపు వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 25 నుంచి జూన్ 5లోగా మునిసిపల్ కమిషనర్ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తారు. సదరు నివేదికను పరిశీలించిన కలెక్టర్ జూన్ 6 నుంచి 11 లోపు జిల్లా మునిసిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్‌కు సమర్పిస్తారు. మునిసిపల్ పాలకవర్గం తీర్మానం, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను, కలెక్టర్, మునిసిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది. జూన్ 24 నుంచి 26లోగా వార్డుల విభజన తుది నివేదికను మునిసిపల్ కమిషనర్ విడుదల చేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 40 వార్డుల్లో సుమారుగా వార్డుకు 1,539 మంది జనాభా, 1,230 మంది ఓటర్లు ఉంటారని అంచనా వేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



**పరవాడ, పతాకం న్యూస్:** ఎలమంచిలి – గాజువాక ప్రధాన రహదారిలోని జల్లెలపాలెం మరిడిమాంబ ఆలయ సమీపంలోజరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నాగవరం గ్రామం నుంచి ఇంజనీరింగ్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులతో స్టీరింగ్ ఆటో దువ్వాడకు బయలుదేరింది. సరిగ్గా ఆటో జల్లెలపాలెం మరిడిమాంబ ఆలయం సమీపానికి వచ్చేసరికి అదే రహదారిలో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న మూలస్వయంభూవరం గ్రామానికి చెందిన బొండా గణేశ్‌కుమార్ అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేశ్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. ఆటో డ్రైవర్ శీరా వసంతకుమార్‌కు ఎడమ చేయి విరిగిపోగా, ఆటో ఉన్న విద్యార్థులు అవినాష్, బాలాజీకుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో గణేశ్‌కుమార్‌ను విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిగతా ముగ్గురిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం ధ్వంసమైంది. ద్విచక్ర వాహనదారుడు తన ముందున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మోదకొండమ్మ ఉత్సవాలకు రూ.2 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు



**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలకు రూ.2 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో జరిగే మోదకొండమ్మ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ భక్తుల నుంచి విరాళాలు సమకూర్చుకుని పండుగను నిర్వహించడం జరుగుతున్నది. అయితే ఈక్రమంలో ప్రభుత్వం సైతం తమ వంతు సాయంగా నిధులు విడుదల చేయడంతో ఉత్సవాలకు మరింత ప్రోత్సాహంగా ఉండేది. అయితే వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు అటువంటి సంప్రదాయం కొనసాగకపోవడంతోపాటు గతేడాది ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు విడుదల కాలేదు. అయితే ఈఏడాది ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కమిటీ సభ్యులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. దీంతో మోదకొండమ్మ ఉత్సవాలకు రూ.2 కోట్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు మాత్రమే పరిమితమయ్యేవి. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రలో పెద్ద గిరిజన ఉత్సవాలుగా మోదకొండమ్మ పండుగ జరుగుతున్న విషయాన్ని గుర్తించిన గత తెలుగుదేశం ప్రభుత్వం, 2016లో రాష్ట్ర స్థాయి గిరిజన ఉత్సవాలుగా మోదకొండమ్మ పండుగను గుర్తించింది. దీంతో ఉత్సవాలకు ప్రత్యేకంగా రూ.కోటి నిధులు విడుదల చేసింది. దీంతో అప్పటి నుంచి ప్రభుత్వపరంగా ఈ ఉత్సవాలకు నిధులు విడుదల చేయడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. అలాగే ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ, ఆలయ కమిటీల సమన్వయంతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

# మ్యూజియం నిర్మాణాలు వేగవంతం చేయాలి



**చింతపల్లి, పతాకం న్యూస్:** లంబసింగి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సుధా భార్గవి ఆదేశించారు. మ్యూజియం నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు మ్యూజియం తుది దశ నిర్మాణాలు, పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లంబసింగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం రాష్ట్రానికి తలమాణికం కానున్నదన్నారు. మ్యూజియం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడం జరుగుతుందని, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన గిరిజన పోరాటయోధుల చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మ్యూజియంలో ఏర్పాటు చేసే ఉద్యమకారుల శిల్పం, చిత్రం పోరాట స్ఫూర్తిని రగిలించేలా ఉండాలన్నారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల శిల్పాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 15 రోజుల్లో బ్లాక్ 1,2 ప్రారంభించాలన్నారు. ఈ బ్లాకుల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పనులను జాప్యం చేయరాదని, నిధుల కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. మ్యూజియం అందుబాబులోకి వస్తే లంబసింగి సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. మ్యూజియం నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఇంజనీరింగ్ అధికారులను సమీక్షించాలని ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ వసంత, టీఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాణి, డీడీ పీబీకే పరిమళ, ఈఈ డేవిడ్‌రాజ్, డీఈఈ రఘునాథరావు నాయుడు, ఏఈఈ యాదకిశోర్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి



**అగనంపూడి, పతాకం న్యూస్:** వివాహం జరిగి 24 గంటలు కాలేదు.. కాళ్ల పారాణి ఆరలేదు. పెళ్లైన తరువాత పుట్టింట అడుగుపెట్టేందుకు భర్తతో కలిసి వస్తున్న నవ వధువును మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈ ఘటనలో వరుడు, ఆమె సోదరికి గాయాలు కాగా, తీవ్రంగా గాయపడిన ఆమె తల్లి ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. విశాఖ నగర శివారు అగనంపూడిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం జిల్లా అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన నడుపూరు రామేశ్వరి (31)కి, అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లికి చెందిన ఈరుగుల నరసింగరావు (42)కు వరుడి ఇంటి వద్ద వివాహం జరిగింది. భర్తతో కలిసి పుట్టింటికి వచ్చేందుకు రామేశ్వరి, తల్లి కనకమహాలక్ష్మి, సోదరి వరలక్ష్మి కారులో బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఆ సమయంలో నరసింగరావు డ్రైవింగ్ చేస్తున్నాడు. పెళ్లి కార్యక్రమాలతో నిద్ర లేక అతడికి కళ్లు మూతలు పడడంతో ప్రమాదం చోటుచేసుకుందంటున్నారు. ఈ ఘటనలో భర్త పక్కన కూర్చున్న రామేశ్వరి సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. వెనుక సీట్లో కూర్చున్న ఆమె తల్లి కనకమహాలక్ష్మి(56)కి తీవ్రగాయాలవగా కేజీహెచ్‌కు తరలించారు. రామేశ్వరి భర్త నరసింగరావు, సోదరి వరలక్ష్మి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది.

# నలుగురు వైద్యులపై క్రమశిక్షణ చర్యలు

**చింతపల్లి, పతాకం న్యూస్:** స్థానిక ఏరియా ఆస్పత్రిలో గతంలో పనిచేసిన నలుగురు వైద్యనిపుణులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో స్త్రీ వైద్యనిపుణులుగా పనిచేసి, ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్‌వీఎస్ సుధా శారద, నాటి ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రస్తుత దంత వైద్యాధికారి డాక్టర్ ఎస్. చంద్రశేఖరరావు, విధులకు దూరమైన ఎనస్థీషియా వైద్యులు టి. విక్రమ్, జనరల్ సర్జన్ డి. అజయ్‌బాబులపై వచ్చిన ఆరోపణలపై రూల్ 24 ఆంధ్రప్రదేశ్(సివిల్ సర్వీసెస్ క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అపీల్) రూల్స్ 1991 ఆధారంగా విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

# గుంటూరు జిల్లాలో ఫుడ్ పాయిజన్ కలకలం.. 50 మందికి అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం కొందరు గ్రామస్థులు తిన్నట్లు సమాచారం. ఆహారం పాడై ఉండటంతో తిన్న కాసేపటికే పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఆహారం తిన్న కొద్ది గంటల్లోనే పలువురికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించాయి. ఒక్కసారిగా గ్రామంలో పలువురు అస్వస్థతకు గురికావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి విషమంగా మారడంతో బాధితులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కొత్తరెడ్డిపాలెం గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని సరైన విధంగా నిల్వ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఆహారం త్వరగా పాడయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## భూముల రీ సర్వేకు డెడ్‌లైన్




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అమరావతిలో జాయింట్ కలెక్టర్లు, భూ సర్వే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రీ సర్వేపై అధికారులకు దిశా నిర్దేశం చేసింది. దీంతో గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లాలో అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాస్తవంగా మన్యంలోని 965 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే ప్రారంభమైంది. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో 317 రెవెన్యూ గ్రామాల్లోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు విడతల్లో రీసర్వే నిర్వహించారు. మొదట విడతగా 15 రెవెన్యూ గ్రామాల్లో, రెండో విడతలో 32, మూడో విడతలో 43, నాలుగో విడతలో 83 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. తాజాగా ఐదో విడతలో 73 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమ వుతున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో 326 నాన్ సిగ్నల్ గ్రామాల్లోనూ రీసర్వే పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసకుంటున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారి (డీఎస్ఎల్‌వో) శ్రీనివాసరావును సరెండ్ చేశారు. ఆ స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో గడువులోగా రీ సర్వే ప్రక్రియ పూర్తవుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 'ఏదేమైనా 2027, మార్చి నాటికి జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేస్తాం. త్వరలోనే పూర్తిస్థాయి జిల్లా సర్వే అధికారి నియామకం జరుగుతుంది. ' అని జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## మహానాడు ఎలా నిర్వహించాలి?



**నెల్లూరు, పతాకం న్యూస్:** మహానాడును ఎలా నిర్వహించాలనే చర్చ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో నెల్లూరులో జరిగింది. కొడవలూరు మండలం రేగడిచెలిక ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఈ నెల 27, 28, 29 తేదీల్లో టిడిపి మహానాడు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. పల్లా శ్రీనివాసరావు తొలిసారి నెల్లూరు జిల్లా టిడిపి కార్యాలయానికి విచ్చేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర కలిసి టిడిపి కార్యాలయంలో మహానాడు కమిటీలతోనూ, నాయకులతోనూ సమావేశమ య్యారు. ప్రధాని మోడీ పొదుపు సూక్తులపై ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఇంధన పొదుపు, వాహనాలను తగ్గించడం, భోజనాలు తగ్గించడం తదితర అంశాలపై చర్చించారు. మహానాడు మూడు రోజులు నిర్వహించాలా? లేదా రెండు రోజులే జరపాలా? బహిరంగ సభ జరపాలా? వద్దా? అనే అంశాలపైనా అభిప్రాయ సేకరణ జరిగింది. మహానాడుకు వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా వసతులు, ఇతర సౌకర్యాల కల్పనపై సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని నిర్ణయానికి వచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పాశం సునీల్ కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ , మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, గంగోదు నాగేశ్వర రావు, బొమ్మి సురేంద్ర, వేనాటి సతీష్ రెడ్డి, బూదాటి రాధయ్య, వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, చెంచల్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

## పశు పోషణకు పెద్దపీట



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పశు పోషణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. పాడి రైతులకు ఆర్థిక భరోసా ఇస్తోంది. పాడి రైతులకు 20 శాతం హైప్రొటీన్, ఇతర పోషక విలువలతో కూడిన దాణాను రాయితీపై అందజేస్తోంది. దీని వినియోగం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.85 లక్షల ఆవులు, 2.5 లక్షల గేదెలు ఉన్నాయి. వేసవిలో పచ్చిమేత అందుబాటులో లేక ఎక్కువ శాతం రైతులు ఎండు గడ్డిపై ఆధారపడుతున్నారు. ఈ కారణంగా పాల దిగుబడి తగ్గుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు దాణా పంపిణీ చేస్తోంది. 50 కిలోల బస్తా ధర రూ.1,110 ఉండగా 50 శాతం సబ్సిడీపై రూ.555కు రైతులకు అందజేస్తున్నది. రెండు పశువులు, ఒక దూడకు 50 కిలోల చొప్పున మూడు నెలలకు 3 బస్తాలు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పొందాలనుకొనే చిన్న, సన్నకారు పాడి రైతులు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలి. దాణా కావాల్సిన రైతులు ముందుగా సమీపంలోని పశువైద్యశాల లేదా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా జిల్లాకు మొత్తం 966.2 టన్నుల హైప్రొటీన్ దాణా నిల్వలు కేటాయించారు. 19,324 మంది రైతులకు వీటిని ఇప్పటికే పంపిణీ చేస్తున్నారు. రెండో విడత మరో 534 టన్నులు జూన్ నెలాఖరులోగా పంపిణీ చేయనున్నారు. పాల దిగుబడి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం దాణాపై 50 శాతం సబ్సిడీ ఇస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు సూచించారు. పాలల్లో వెన్న శాతం, నాణ్యత కూడా పెరుగుతుందన్నారు.

# నేడు నరసన్నపేటలో చంద్రబాబు పర్యటన.. ఏర్పాట్లు పూర్తి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** నరసన్నపేటలో ఈనెల 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వెల్లడించారు. నరసన్నపేటలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లు, సభా ప్రాంగణం, తామరాపల్లి వద్ద హెలీప్యాడ్ పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నరసన్నపేట మేజర్ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ముఖ్యమంత్రి రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంద'ని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సీఎం పర్యటన ఏర్పాట్లను జడ్పీ సీఈవో వెంకట్రామన్, డీపీవో స్వరూపరాణి పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అధికార యంత్రాంగం అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ భద్రతా అధికారులతో కలిసి పర్యటన రూట్ మ్యాప్‌ను నిశితంగా పరిశీలించారు. తామరాపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ నుంచి నరసన్నపేట ప్రజావేధిక స్థబాస్థలి వరకు అక్కడి నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వరకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం భద్రతా విభాగం ఏఎస్పీ కృష్ణరావు, డీఎస్పీ బి.రాజ్‌కుమార్ నేతృత్వంలో బృందం భద్రతా పరమైన అంశాలపై స్థానిక అధికారులకు పలు సూచనలు చేసింది. సభకు వచ్చే ప్రజల ప్రవేశమార్గాలు, వాహనాలు పార్కింగ్, సెక్యూరిటీ చెక్‌పాయింట్లు, వైద్య శిబిరాల ఏర్పాటుపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో స్వప్నిల్ పవర్ జగన్నాథ్, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీఈవోలు వేణుగోపాల్, కృష్ణమూర్తి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, పీఆర్ ఎస్ఈ వీరన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జీడి పిక్కల ధరలు ఢమాల్.. ఆందోళనలో రైతులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఉద్దాన ప్రాంత రైతులకు ప్రధాన జీవనాధారమైన జీడి పిక్కల ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ నెల చివరి వారంలో 80 కిలోల పిక్కల బస్తా ధర రూ.13,500 ఉండగా, ప్రస్తుతం రూ.12వేల నుంచి 12,500 పలుకుతోంది. బస్తాపై ఒకేసారి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు తగ్గడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి గత ఏడాదితో పోల్చితే జీడి పిక్కలు దిగుబడి ఈ ఏడాది తగ్గింది. దీంతో ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశించారు. కానీ, గత సంవత్సరం కంటే ధర తక్కువ ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాల్లో ఏడాదికి లక్ష బస్తాల పిక్కలను రైతులు పండిస్తుంటారు. వీటిని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న వ్యాపారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జీడిపరిశ్రమ యజమానులే కొనుగోలు చేస్తుంటారు. అయితే పెద్ద వ్యాపారులు ఉద్దాన ప్రాంతాల్లో పండించే పిక్కల కంటే ఇతర ప్రాంతాలు, విదేశీ పిక్కలను కొనేందుకు మొగ్గు చూపుతుండడంతో స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విదేశీ పిక్కల దిగుమతిపై ఆంక్షలు విధించినట్లయితే ఉద్దానం పిక్కలకు మంచి ధర పలికి గిట్టుబాటు లభిస్తుందని రైతులు అంటున్నారు. బస్తా పిక్కలను రూ.16 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నా వ్యాపారులు మాత్రం రూ.12,500 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. ఇదే ధరలు చివరు వరకు కొనసాగితే పెట్టుబడి సొమ్ముకూడా కూడా రాదని ఆవేదన చెందుతున్నారు. జీడిపప్పు నిల్వలు పెరిగిపోవడంతోనే పిక్కల ధరలు తగ్గుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. లక్షల విలువైన పప్పు ఫ్యాక్టరీల్లో నిల్వ ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో చాలామంది వ్యాపారులు పిక్కలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదంటున్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా కొన్ని దేశాలకు జీడిపప్పు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారుల వద్ద నిల్వలు పేరుకుపోయాయి. ఈ నిల్వలు తగ్గితే జీడిపిక్కల ధరలు పెరిగే అవకాశం ఉంది.


## వడదెబ్బతో ఉపాధి కార్మికుడు మృతి

**పాలకొండ, పతాకం న్యూస్:** వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలో చోటు చేసుకుంది. తోటి ఉపాధి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని భాసూరు గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు కోమటి పుష్పనాథం (62) గ్రామంలో ఉపాధి హామీ కింద చేపడుతున్న కాలువ పనులకు చేసేందుకు ఉదయం వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో తోటి కార్మికులు పుష్పనాథాన్ని లేపడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పుష్పనాథం మృతిపై ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ ఎంపిఒకు సమాచారం ఇచ్చారు.




## వచ్చే ఏడాది నుండి ఆన్ లైన్‌లో నీట్ పరీక్ష

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వచ్చే ఏడాది నుండి నీట్-యుజి పరీక్షను పూర్తిగా ఆన్ లైన్ లో (కంప్యూటర్ ఆధారితంగా) నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. నీట్-యుజి ప్రశ్నా ప్రతాల లీకేజీకి ప్రధాన కారణం ఓఎంఆర్ షీట్స్ ( ఆప్టికల్ మార్క్డ్ రికగ్నిషన్ ) అని చెప్పుకొచ్చారు. నీట్ పరీక్షపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఓఎంఆర్ షీట్స్ కారణంగానే లీకేజీ జరుగుతోందని, పారదర్శకతను నిర్ధారించడానికి, వచ్చే ఏడాది నుండి నీట్-యుజీ పరీక్షను ఆన్ లైన్ లో నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థుల కష్టాన్ని ప్రభుత్వం గౌరవిస్తుందని అన్నారు. అలాగే నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్ టి ఎ) జూన్ 21న నిర్వహిస్తుందని అన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన అవకతవకలపై సిబిఐ సమగ్ర విచారణ జరుపుతుందని అన్నారు. ఇటువంటి అవకతవకలు మరోసారి జరగనివ్వమని, విద్యార్థులు చెల్లించిన ఫీజులను వాపసు ఇస్తామని అన్నారు. మరోసారి పరీక్ష రాసే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన పరీక్ష కేంద్రాన్ని ఎంచుకునేందుకు కూడా ఎన్ టిఎ అనుమతిస్తుందని అన్నారు. అయితే ఎన్‌టిఎను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.



(మొదటిపేజీ తరువాయి)

## శివయ్య.. నీ త్రిశూలం ఖర్చు ఎంతయ్యా!



త్రిశూలాన్ని అంత డబ్బులు పెట్టి చేయించారా అంటే నమ్మశక్యంగా లేదని.. ఇలా ఉంటే శివయ్య క్షమించి వదిలేస్తాడా... ఆధ్యాత్మిక ముసుగులో ప్రజాధనాన్ని ఏ విధంగా పక్కదారి పట్టించారనే సందేహాలకు ప్రజాప్రతినిధులు అంకెలు అద్దం పడుతున్నాయి. విశాఖపట్నం పర్యాటక రంగంలో మకుటయానంగా నిలిచే కైలాసగిరిపై నూతనంగా ఏర్పాటు చేసిన భారీ త్రిశూలం, డమరుకం ప్రాజెక్టు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. నగరం నడిబొట్టిన సముద్ర మట్టానికి వందల అడుగుల దూరం ఎత్తున కొలువుదీరిన శివపార్వతుల విగ్రహాల చెంత ఈ ఆధ్యాత్మిక నిర్మాణాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అత్యంత అట్టహాసంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకకు రాష్ట్రమంత్రి నారాయణతో పాటు, స్థానిక ఎంపీ శ్రీభరత్, వి.ఎం.ఆర్.డి చైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో పాటు అధికారులు , ప్రజా ప్రతినిధులు పాల్గొని హాజరయ్యారు. ప్రాజెక్టు నిర్మాణానికి వెచ్చించిన నిధులు విషయములో ప్రజాప్రతినిధులు వెల్లడించిన భిన్నమైన లెక్కలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మిగిలిపోతున్నాయి. నగరం మొత్తం చర్చనీయాంసంగా మారాయి. పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రదేశంలో చేపట్టిన పనులపై వ్యయం విషయములో స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు దారితీసింది.. అధికారులు తల పట్టుకునే పరిస్థితి వచ్చింది. ప్రజలు అధికారం ఇచ్చింది, ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది అందలమెక్కించింది, కేవలం ప్రజలకి వారథిగా పనిచేస్తారని కాని నిధులు, విధులు సక్రమంగా ఖర్చు పెడతారని మిమ్మల్ని అధికార కూర్చోబెడితే దుబారా ఖర్చు పెడతారా. ఇది ఎంతవరకు న్యాయం అని కొంతమంది మేధావులు, ప్రజలు చర్చనీయాంశంగా మాట్లాడుకుంటున్నారు... ఈ ప్రాజెక్టు ప్రారంభ దశలో ఉన్నప్పుడు అధికారులు దీని నిర్మాణానికి సుమారు కొటిన్నర రూపాయలు ఖర్చవుతుంది అని అంచనా వేశారు. సాధారణంగా ఏ ప్రాజెక్టులో అయినా ముడిసరుకు ధరలు పెరుగుదల వల్ల స్వల్పంగా వ్యయం పెరగటం సహజంగా జరుగుతుంది.. ఇలాంటి క్రమములోనే నిర్మాణ పనులు పూర్తయ్యేసరికి ఈ వ్యయం రెండున్నర కోట్ల రూపాయలకు చేరుకున్నట్టు అధికారులు గతంలో సంకేతాలు ఇచ్చారు... కానీ అసలు వివాదం ప్రారంభోత్సవ వేడుక వద్ద మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు ప్రాజెక్టు ఖర్చు గురించి వెల్లడించిన గణంకాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఒకరు మూడు కోట్లను చెబితే మరొకరు ఏకంగా ఆరు కోట్ల అని ప్రకటించడం అక్కడ ఉన్న వారందరికీ విస్మియానికి గురి చేసింది. ప్రభుత్వ రికార్డులో ఉన్న లెక్కలు ప్రజాప్రతినిదులు మాటలకు పొంతన లేకపోవడంతో అసలు నిజమేంటో తెలియక సామాన్య ప్రజలు అయోమయంలో పడ్డారు అనటానికి పొంతన లేని సమాధానాలు నిదర్శనమే ఈ త్రిశూలం యొక్క బడ్జెట్. సాధారణంగా ఏదైనా ప్రభుత్వ ప్రాజెక్టు ప్రారంభానికి మంత్రులు, ఎంపీలు లేదా ఇతర ముఖ్య ప్రతినిధులు వచ్చినప్పుడు సంబంధిత శాఖ అధికారులు ఈ ప్రాజెక్టు సంబంధించిన పూర్తి వివరాలు సాంకేతిక అంశాలు వ్యయానికి సంబంధించిన నివేదికలు ముందుగానే అందజేస్తారు. కాని విశాఖ మహానగర అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రాజెక్టు విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వలేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఒకే వేదికపై ఉన్న నాయకులు వేరే వేరే అంకెలు చెప్పటం వెనక అధికారులు సమన్వయ లోపం ఉందా? లేదా? అనే ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని గోప్యంగా ఉంచారా అనేది మిస్టరీగా మారింది.. ప్రాజెక్టు వ్యయంపై కనీస అవగాహన లేకుండానే నాయకులు ప్రారంభోత్సవానికి వచ్చారా విమర్శలు కూడా బహిరంగంగా వినిపిస్తున్నాయి. గత ఏడాది నాటికి పూర్తి కావలసిన ఈ ప్రాజెక్టు వాయిదా పడుతూ వచ్చి ఎట్టకేలకు ఇప్పుడు పూర్తయింది. ఈ జాప్యానికి తోడు ఖర్చు విషయంలో వెళ్ళడవుతున్న పరస్పర విరుద్ధ ప్రకటనలు నిధులు దుర్వినియోగంపై అనుమానాలు బలపరుస్తూ ఉన్నాయి. వీఎమ్ఆర్డిఏ నిధులు సక్రమంగా వినియోగం అయ్యాయా లేక కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం అంచనాలను పెంచేసారా అనే కోణంలో చర్చ జరుగుతుంది. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే క్రమములో పారదర్శకత లోపించటం వల్లే ప్రభుత్వం ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంది. ప్రజాధనంతో చేపట్టిన ఇలాంటి కీలక ప్రాజెక్టులో ఒక్క రూపాయి లెక్క ప్రజలకు తెలియవలసిన అవసరం ఉంది. కానీ ఇక్కడ మాత్రం కోట్ల రూపాయలు వ్యత్యాసం కనిపిస్తున్న ఎవరు స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. కైలాసగిరిపై త్రిశూలం డమరుకం ఏర్పాటు ఆధ్యాత్మికంగా పర్యటనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చే విషయమే.. అయినా, దాని వెనుక ఉన్న వ్యయ వివాదం ఈ సంతోషాన్ని నీరుగారిస్తోంది. అధికారులు చెబుతున్న లెక్కలకు, నాయకులు చెబుతున్న కోట్లకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. నిధులు పక్కదారి పట్టాయా? లేక కేవలం మాటలు పొరపాటు వల్ల ఈ గందరగోళం ఏర్పడిందా? అన్నది బహిర్గతం కావాలి. అప్పుడే పర్యాటక అభివృద్ధిలో నిజాయితీ నిలుస్తుంది. విశాఖ వాసులు, పర్యాటక ప్రేమికులు ఈ ప్రాజెక్టుపై వెళ్ళడవుతున్న అనుమానాలపై ప్రభుత్వం నుండి ఒక స్పష్టమైన అధికారిక ప్రకటనను ఆశిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల మధ్య ఉన్న ఈ అవగాహన లోపాన్ని సరిదిద్దుకోవలసిన అధికారులు మరియు రాజకీయ నాయకులు ఎంత ఖర్చు అయ్యిందో ప్రతి పైసా సంబంధించినటువంటి విషయాలన్నీ బయటపెట్టినప్పుడు ఈ వివాదానికి తెరపడుతుంది.

- లెక్కల శ్రీనివాస్

## పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి




**అమరావతి, పతాకం న్యూస్:** పెంచిన ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలని, పార్లమెంటులో పెట్టిన 2025 ఫెర్టిలైజర్ బిల్లును ఉపసంహరించుకోవాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ కృష్ణలంకలో ఉన్న ఫెర్టిలైజర్, కెమికల్స్ ట్రావెన్కోర్ లిమిటెడ్ ఎపి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. గత 75 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల సరఫరాను పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. ఈ బాధ్యత నుంచి తప్పించుకోవటానికి చర్యలు ప్రారంభించాయన్నారు. ఇందులో భాగమే 2025 ఫెర్టిలైజర్ బిల్లు అని తెలిపారు. ఎరువుల పర్యవేక్షణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమంగా, సీజన్ వారీ తగ్గించుకుంటూ వస్తున్నాయని తెలిపారు. ఎరువుల బాధ్యతలు పెద్దయెత్తున ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతుందన్నారు. ఇది రైతులకు చాలా భారంతో కూడుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వ్యవసాయం దెబ్బతినకుండా కాపాడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకోవటం వల్ల రైతాంగం మీద అధిక భారం పడుతుందన్నారు. ఎరువులకు బస్తాకు రూ.100 నుంచి రూ.300 పెంచిన కేంద్ర ప్రభుత్వం, పంటలకు మద్దతు ధర పెంచటానికి ముందుకు రావటం లేదన్నారు. కనీస మద్దతు ధర క్వింటా మొక్కజొన్నకు రూ.10 పెంచి, 25 కేజీల ఎరువుల బస్తాకు రూ.300 పెంచినట్లు పేర్కొన్నారు. యుద్ధం పేరుతో రైతుల మీద కూడా భారాన్ని మోపుతుందన్నారు. ఎరువుల పాత స్టాక్‌ను కొత్త రేట్లకు రైతులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిపై విజిలెన్స్ డిపార్టమెంట్, ప్రభుత్వం ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం మీద భారం పడకుండా చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతులను భూముల నుంచి దూరం చేసి ఆ భూములను కార్పొరేట్ వ్యవస్థలకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త యాప్ ద్వారా పంపిణీ చేస్తే కొంత మందికే ఎరువులు లభిస్తాయని తెలిపారు. ఇలాంటివి జరిగితే ఆహారం కొరత వస్తుందన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి బలరాం మాట్లాడుతూ.. ఎరువుల ధరలు పెంచడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ఖర్చులు తగ్గించుకోవాలని ఒకవైపు సలహాలు ఇస్తూనే మరోవైపు ఎరువుల ధరలు, విత్తనాల ధరలు పెంచుతున్నాయని వెల్లడించారు. పెంచిన ఎరువుల ధరలను వెంటనే ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై కేంద్రాన్ని డిమాండ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యకులు పి రంగారావు, కోశాధికారి వై రాధాకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## నాట్కో కేన్సర్ యూనిట్‌లో పెట్ స్కానింగ్ ప్రారంభం



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రూ.18 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పెట్ స్కాన్ యంత్రాన్ని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ పూర్తి స్థాయిలో కేన్సర్ నిర్ధారణకు ఈ యంత్రం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో తొలి సారిగా గుంటూరులో పెట్ స్కాన్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. కేన్సర్ నిర్ధారణకు పెట్ స్కాన్ ను బయట ప్రైవేట్ ఆస్పత్రులలో చేయించుకోవాలంటే ఒక్కో వ్యక్తికి సుమారు రూ. 25,000 ఖర్చు అవుతుందన్నారు. ఈ నాట్కో సెంటర్లో పెట్ స్కాన్ సౌకర్యం పూర్తిగా ఉచితమని తెలిపారు. రెగ్యులర్ స్కాన్ లో దొరకని కేన్సర్ వ్యాధి గుర్తింపును ఈ పెట్ స్కాన్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. వైద్యులు ప్రతిపాదించినప్పుడు మాత్రమే స్కాన్ చేయించుకోవాలని అనవసరంగా చేయించుకోవద్దని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ దేశంలోనే ఎల్ -- వన్ కేన్సర్ సెంటర్ గా రూపాంతరం చెందిన నాట్కో కేన్సర్ సెంటర్లో ఈ సౌకర్యం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ వంటి వ్యాధులకుగానూ 1.20 లక్షల మందికి ఉచిత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎమ్మెల్యేలు నశీర్ అహ్మద్, బి రామాంజనేయులు, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, టిడిపి నాయకులు డేగల ప్రభాకర్, వందనా దేవి, తాళ్ల వెంకటేశ్వర్ యాదవ్, పారిశ్రామిక వేత్త తులసి రామచంద్ర ప్రభు పాల్గొన్నారు.

## ఈ నెల 26నే కేరళకు రుతుపవనాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయని అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి ఐదు రోజులు ముందుగా, అంటే మే 26నే తీరాన్ని తాకే అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, ఈ తేదీకి నాలుగు రోజులు అటూఇటూగా రుతుపవనాలు కేరళలో ప్రవేశించవచ్చు. అంటే మే 22 నుంచి మే 30 మధ్య ఎప్పుడైనా నైరుతి రుతుపవనాల రాక ఉండొచ్చని అర్థం చేసుకోవాలి. రుతుపవనాల ఆగమనంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. వేసవి కాలం ముగిసి, వర్షాకాలం ప్రారంభానికి ఇది సూచికగా నిలుస్తుంది.

# చివరి దశలో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు



**అమరావతి, పతాకం న్యూస్:** గత టీడీపీ ప్రభుత్వంలో 2708 ఎకరాల భూసేకరణ అనంతరం అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న నారాచంద్రబాబునాయుడు 2019 ఫిబ్రవరి 14న భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా 2023 మే3న శంకుస్థాపన చేశారు. పనులు తూతూమంత్రంగా చేపడుతూ గత ప్రభుత్వంలో 26శాతం మాత్రమే చేయగలిగారు. కాగా 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయం కీలక మలుపు తిరిగింది. ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 2026 జూలై నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. నిర్మాణ పనులను పరుగులు పెట్టించారు. ఇదే సమయంలో పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా ఎప్పటికప్పుడు విమానాశ్రయ నిర్మాణాన్ని పరిశీలిస్తూ సమీక్షిస్తూ వచ్చారు. పనులు చివరి దశకు చేరుకొన్నాయి. జూలైలో ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. ఇటీవల ట్రయల్ రన్ కూడా విజయవంతం అయింది. ఏడాదిలో 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే విధంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టారు. తాగునీరు, విద్యుత్ పనులు పూర్తి అయ్యాయి. ఉత్తరాంధ్ర సాంస్కృతి ప్రతిబింబించేలా రూపురేఖలు ఉన్నాయి. జాతీయ రహదారి-16ని ఎయిర్‌పోర్టు రహదారితో కలిపే విధంగా అమటాంరాయవలస సమీపంలో చేపట్టిన ట్రంపెట్ నిర్మాణం దాదాపు పూర్తికావొస్తోంది. అలాగే విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు రావాలంటే సుమారు 55 కిలోమీటర్లకు పైగా దూరం ఉండడంతో తక్కువ సమయంలో వచ్చేందుకు అప్రోచ్ రహదారులను సిద్ధం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు అధికారులు, సిబ్బంది నివాస గృహాలు సైతం కొలిక్కి వచ్చాయి. రామచంద్రపేట సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. నందిగాం సమీప చంపావతి నది నుంచి ఎయిర్‌పోర్టుకు అవసరమైన తాగునీరు సరఫరా కానుంది.

విశాఖ జిల్లా భీమిలి నుంచి భోగాపురం వరకు ఆరు రహదారుల బీచ్‌కారిడర్ నిర్మాణం జరగనుంది. ఎయిర్‌పోర్టు సమీపంలో విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం పరిధిలో ఒబెరాయ్ హోటల్‌తో పాటు మరికొన్ని స్టార్ హోటళ్ల నిర్మాణం జరుగనుంది. ఫైవ్ స్టార్ హోటల్స్ రానున్నాయి. ఏవియేషన్ యూనివర్సిటీ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఎలక్ట్రికల్ బస్సులు నడిపేలా ఎయిర్‌పోర్టు నిర్వాహకులు ఆర్‌టీసీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 3.8 కిలోమీటర్ల మేర రన్‌వే ఈ ఎయిర్‌పోర్టు ప్రత్యేకత. ఇప్పటికే అత్యాధునిక ఎయిర్‌పోర్టులుగా ముంబయి, ఢిల్లీ సమీపంలోని నొయిడా ఉన్నాయి. ఇప్పుడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సైతం వాటి సరసన చేరనుంది. మత్స్య ఆకారంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా విమానాశ్రయంలో ఇంటీరియర్ డిజైన్ చేశారు. ఎయిర్‌పోర్టుకు దగ్గరగా 500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం రిజర్వులో పెట్టింది. అక్కడ పర్యాటక, ఇతరత్రా నిర్మాణాలు చేపట్టనున్నారు.

# స్టీలు బ్రిడ్జిలో బయటపడ్డ నిర్మాణం లోపం!



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి రాజధాని కనెక్టివిటీ కోసం ఏర్పాటు చేస్తున్న స్టీలు బ్రిడ్జిలో నిర్మాణ లోపం బయటపడింది. రాజధాని నగరం నుండి నేరుగా 16వ నెంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు వంతెన నిర్మాణం ఇతర పనులకు కలిపి రూ.68 కోట్లు కేటాయించారు. ఉండవల్లి నుండి మణిపాల్ వరకూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, అలాగే కొండవీటివాగు గేట్ల వద్ద రెండు లైన్ల వంతెన నిర్మాణంలో భాగంగా రాజధాని ట్రాఫిక్‌ను మళ్లించేందుకు దీన్ని నిర్మిస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వంతెనను తొలుత ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలని అనుకున్నారు. అయితే మార్చి, ఆ తర్వాత ఏప్రిల్ నెలాఖరుకు పూర్తిచేస్తామని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ వంతెనపై ముఖ్యమంత్రి కూడా రెండుసార్లు సమీక్ష నిర్వహించారు. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తొమ్మిది సార్లు ఈ వంతెన పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అప్పట్లో ఐరన్ స్పాన్లు బిగించేశారు. మొత్తం నాలుగు లైన్లుగా బిగిస్తున్న ఈ వంతెన నిర్మాణంలో దక్షిణ భాగంలో నిర్మించిన వంతెన గడ్డర్లు వంకర పోయాయి. తొలుత వేగంగా నిర్మాణ పనులు చేపట్టామని తెలిపిన అధికారులు చివర్లో లోపాన్ని గుర్తించారు. దక్షిణ భాగంలో నిర్మించిన రెండో వంతెన మధ్యలో గడ్డర్లు ఉండాల్సిన దానికంటే అదనంగా వంకర పోయాయి. దీనిపై శ్లాబు వేస్తే ఇబ్బందులొస్తాయని అధికారులు హెచ్చరించడంతో కొద్దికాలం భారీ క్రేన్ సపోర్టుతో నిలబెట్టారు. వంకర మరీ పెరిగిపోతుండటంతో వెంటనే తొలగించాలని నిర్ణయించారు. బుధ, గురువారాల్లో తొలగింపు పనులు చేపట్టారు. దక్షిణభాగంలో ఉన్న వంతెన మధ్యలో ఉన్న స్టీలు గడ్డర్లు తొలగించారు. అవన్నీ పూర్తిగా తొలగించి మరలా ఎలైన్‌మెంట్ పూర్తి చేసి శ్లాబు వేస్తామని అధికారులు చెబుతున్నారు. దీనిపై సిఆర్‌డిఎ అధికారులను అడగగా వంతెన నిర్మాణం ఎన్‌సిసి కంపెనీ చేపడుతోందని, గడ్డర్లు బిగించే సమయంలో కొంత వంకర వచ్చిందని, నిర్మాణ లోపాన్ని గుర్తించామని తెలిపారు. గడ్డర్లు వంకర పోవడంతో పాటు ఎత్తులోనూ స్వల్ప తేడా వచ్చిందని గుర్తించి నట్లు పేర్కొన్నారు. అప్పుడే సరిచేయాలని కాంట్రాక్టు సంస్థలను కోరగా.. చేశామని చెప్పారని, శ్లాబువేసే సమయంలో లోపం మరింత పెరిగిందని వివరించారు. గత నెల 20వ తేదీనే దీన్ని గుర్తించామని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం వంకర ఉన్నచోట్ల గడ్డర్లు తొలగించి మరలా బిగిస్తామని, అనంతరం శ్లాబు వేస్తామని కాంట్రాక్టు సంస్థ తెలిపినట్లు వివరించారు. అమరావతి నిర్మాణ పనుల్లో లోపాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. గతంలో సెక్రటేరియల్ వెనుక సిఎం నివాసం నిర్మిస్తున్న రోడ్డు కూడా పూర్తిగా పగిలిపోయింది. దీన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డును పునర్నిర్మించారు. ఇప్పుడు స్టీలు బ్రిడ్జి నిర్మాణంలో లోపాలు వెలుగు చూశాయి. దాన్ని కూడా పునర్నిర్మిస్తున్నారు. వేల కోట్ల విలువైన పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థలు కూడా లోపాలతో నిర్మాణాలు చేపట్టడం, అధికారులో.. మరొకరో గుర్తించిన తరువాత సరిచేయడం వంటి చర్యలతో అమరావతి రాజధాని పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. పిల్లర్లు వేసిన సబ్ కాంట్రాక్టర్ స్టీలు బ్రిడ్జి పిల్లర్లను సబ్ కాంట్రాక్టర్ నిర్మించారని ఎన్‌సిసి ప్రతినిధులు తెలిపారు. నిర్మాణ లోపంపై ప్రశ్నించగా సబ్ కాంట్రాక్టర్ వ్యవహారం బయటకు వచ్చింది. ప్రస్తుతం స్టీలు బ్రిడ్జి నిర్మాణ సమయంలో పశ్చిమ కాలువకు రెండువైపులా వేసిన పిల్లర్లు సబ్ కాంట్రాక్టరు నిర్మించినట్లు తెలిపారు.

## బండి భగరీథ్‌ను వెంటనే అరెస్టు




**విజయవాడ, పతాకం న్యూస్:** బాలికపై లైంగిక దాడికి, వేధింపులకు పాల్పడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సాయంత్రం విజయవాడ లెనిన్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఐద్వా, పిఒడబ్ల్యు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు తదితర మహిళా సంఘాల ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో మహిళా నేతలు మాట్లాడారు. హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై బండి భగీరథ్ లైంగిక దాడికి, వేధింపులకు పాల్పడిన ఘటనకు సంబంధించి పోక్సో కేసు నమోదై ఆరు రోజులు గడిచినా ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేవన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని చెబుతూ చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని తప్పించుకొనేందుకు పరోక్షంగా పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. దేశంలో చట్టాలు బలవంతులపై బలహీనంగా, బలహీనులపై బలంగా పనిచేస్తాయనేందుకు ఈ ఘటన రుజువు చేస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని అధికారాన్ని అడ్డం పెట్టుకొని చట్టం నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మరోవైపు బాధితురాలిపైనే తిరిగి కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తాము అధికారంలో ఉన్నామనే అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పోలీసులు తక్షణమే నిందితుడిని అరెస్టు చేసి ప్రజలకు పోలీసు శాఖపై ఉన్న నమ్మకాన్ని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. రాజీనామా చేయని పక్షంలో మంత్రి ఎక్కడికి వెళ్లినా మహిళా సంఘాల నిరసనలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి నేరాలపై విచారణ త్వరగా సాగి నిందితులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేసేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎపి మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గంబ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవానీ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీదేవి, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పద్మ, సిఎంఎస్ రాష్ట్ర నాయకులు రాధ పాల్గొన్నారు.

## ఫోన్ ఇవ్వలేదని మనస్తాపానికి గురై.. విద్యార్థిని ఆత్మహత్య



**విజయనగరం, పతాకం న్యూస్:** : క్షణికావేశం నిండుప్రాణాన్ని బలిగొంది. తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ ఇవ్వలేదన్న ఒకే ఒక్క కారణం ఆ అమ్మాయి పాలిట శాపంగా మారింది. అమ్మానాన్న పొలానికి వెళ్లగానే ఉరివేసుకుని ప్రాణం తీసుకుంది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కూతురు ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడాన్ని చూసి తట్టుకోలేక పోయారు. తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సహాయంతో కొనఊపిరితో ఉన్న కుమార్తెను కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బందు వుల రోదనలతో రాజాం ఏరియా ఆసుపత్రి నిండిపోయింది. హృదయ విధారకర మైన ఈ సంఘటన విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని జగన్నాథవలసలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథవలస గ్రామానికి చెందిన వ్యవసాయకూలీలు రామ్‌కుమార్, హేమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో అనుష్క(16) ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తిచేసి బెటర్‌మెంట్ కోసం సన్నద్ధం అవుతోంది. పొలానికి వెళ్తన్న తల్లిదండ్రుల్ని ప్రిపరేషన్ కోసం మొబైల్‌ఫోన్ ఇమ్మని కోరింది. 'నాలుగురోజుల్లో పరీక్షలున్నాయి.. సెల్ ఎందుకు, చదువుకోమని' చెప్పి రామ్‌కు మార్, హేమలత తమ చిన్నకుమార్తెతో కలిసి పొలానికి వెళ్లిపోయారు. ఇంట్లో ఒక్కరే ఉండడం, తల్లిదండ్రులు మొబైల్ ఇవ్వకపోవడాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనస్థాపానికి గురైన అనుష్క క్షణికావేశంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది.

## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం.. కావేరి ట్రావెల్ బస్సు దగ్ధం



**ప్రకాశం, పతాకం న్యూస్:** ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం భీమవరం అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున జరిగిన కావేరి ట్రావెల్ బస్సు దగ్ధమైంది. తృటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాదు నుండి తిరుపతికి బయలుదేరిన కావేరి బస్సులో భీమవరం అడ్డరోడ్డు వద్ద ఇంజన్ నుంచి పొగలు రావటం గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును ఆపి ప్రయాణికులను కిందికి దించి వేశాడు. ప్రయాణికులు హుటాహుటిన బస్సు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. 36 మంది ప్రయాణికులకు తృటిలో ఘోర అగ్ని ప్రమాదం నుండి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

## రవాణా రంగ అభివృద్ధికి సహకరించండి



**అమరావతి, పతాకం న్యూస్:** రవాణా రంగ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎపి బస్ ఆపరేటర్స్‌కు సూచించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఏపీ బస్ ఆపరేటర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఎపి బస్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్, ఉపాధ్యక్షులు నాని, కార్యదర్శి రాంబాబు, ట్రెజరర్ సందీప్‌తో పాటు కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రవాణా రంగ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## డీఎంకె ఫోరం బలహీనపడలేదు: స్టాలిన్



**చెన్నై, పతాకం న్యూస్:** ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె నేతృత్వంలో ఫోరం సంపూర్ణ విజయాన్ని సాధించలేకపోయినా, బలహీన పడలేదని ఆ పార్టీ అధ్యక్షులు ఎంకె స్టాలిన్ తెలిపారు. ఈ ఎన్నికల్లో 1.54 కోట్లకు పైగా ఓట్లు రావడం, 72 సీట్లను గెలుచుకోవడం తమపై రాష్ట్ర ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వెల్లడిస్తుందని చెప్పారు. ఈ మేరకు స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా ఫోరంలోని మిత్రపక్షాలన్నీ తమ అనుబంధాన్ని తెంచుకోకుండా, డిఎంకెతోనే తమ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తామని ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. 'మిత్రపక్ష నాయకులకు డిఎంకె పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది- అని ఆయన అన్నారు. అందుకు తగినట్లుగానే సిద్ధాంతపరమైన రాజకీయ పార్టీలుగా ఐక్యంగా నిలబడతామని స్టాలిన్ తెలిపారు. ' ప్రజా సంక్షేమం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ఎప్పటిలాగే మా ప్రయాణాన్ని కొనసాగిస్తాం. తమిళనాడును రక్షించుకునే శక్తి, పోరాట స్ఫూర్తి మా సొంతం- అని స్టాలిన్ తెలిపారు. ఈ ఎన్నికల్లో డిఎంకె ఫోరం విజయం కోసం కృషి చేసినవారికి, సహకారం అందించిన వారికి స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

## పెంచిన పెట్రోల్ ధరలను రద్దు చేయాలంటూ.. సీపీఎం వినూత్న నిరసన



**విజయవాడ, పతాకం న్యూస్:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను రద్దు చేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గేంత వరకు దేశమంతా సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీ నాథ్ అన్నారు. శుక్రవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పెట్రోల్ బంకు వద్ద పెద్దఎత్తున ప్రజలతో కలిసి నినాదాలతో నిరసన తెలుపుతూ రిక్షా బండికి మోటార్ సైకిల్ ను కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీ నాథ్ మాట్లాడుతూ .... కేంద్ర ఎన్డిఎ ప్రభుత్వం పెట్రోల్ పై 3.30పై, డీజిల్ పై 3.14పై పెంచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్ లీటరు 112.50పై, డీజిల్ రూ.101 చేరిందని తెలిపారు. దీనివలన దేశంలో ఉన్న నిత్యావసర సరుకుల ధరలు అన్ని పెరిగిపోతాయన్నారు. రైతాంగం దెబ్బతింటుందని, రవాణా రంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముందు ఒక్క నయాపైసా పెట్రోల్, డీజిల్ పై పెంచబోమని మోడీ, బీజేపీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడం అయిపోగానే ధరలు పెంచి ప్రజలకు నమ్మక ద్రోహం చేసిందని మండిపడ్డారు. పశ్చిమ ఆసియా యుద్ధ పరిస్థితులను అడ్డం పెట్టుకుని మోడీ ప్రభుత్వం ఈ కుట్రలు పన్నుతుందన్నారు. ధరల పెంపు ఈ దశలో జరిగింది కాదనీ, నిన్న, మొన్న హైదరాబాద్ లో పొదుపు చేయాలని మాట్లాడటం వెనుక అంతర్యం ఈ ధరలు పెంచేందుకు ప్రజలను మానసికంగా సిద్ధం చేయడం కోసమేనని అన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ పై కేంద్రం 21/- టాక్స్, రాష్ట్ర టాక్స్ 25/- వసూళ్ళు చేస్తుందన్నారు. రూ.45-46 పెట్రోల్, డీజిల్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూళ్ళు చేస్తున్నాయన్నారు. ఈ పన్నులు తగ్గించుకోకుండా ప్రజల జేబులు కొట్టి ప్రభుత్వ ఖజానా నింపుకుంటుందన్నారు. 12 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వానికే రూ.30 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, ఆ డబ్బు ఖర్చు చేయాలని కోరారు. ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బు ఖర్చు చేయకుండా ప్రజలపై భారం ఎందుకు వేస్తున్నారు అని ప్రశ్నించారు.

# వేసవిలో ఎక్కువగా వచ్చే కడుపు ఉబ్బరం సమస్య తగ్గాలంటే..!

వేసవి కాలంలో కడుపు ఉబ్బరం (బ్లోటింగ్) సమస్య చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. ముఖ్యంగా వేడి ఎక్కువగా ఉన్న సమయంలో శరీరంలో నీటి లోపం, అజీర్ణం, తిన్న ఆహారం నెమ్మదిగా జీర్ణం కావడం వంటి కారణాల వల్ల పొట్ట ఉబ్బినట్లు, భారంగా అనిపించడం సాధారణమే. ఇలాంటి సమయంలో శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు జీర్ణక్రియకు సహాయపడే పండ్లను తీసుకోవాలని చూస్తూ ఉంటారు. అందులో బొప్పాయి , అనాసపండు ప్రధానంగా చర్చకు వస్తాయి. ఈ రెండు పండ్లలో కూడా జీర్ణక్రియకు ఉపయోగపడే ప్రత్యేక ఎంజైములు ఉండటంతో, బ్లోటింగ్ తగ్గించడంలో సహాయపడతాయని భావిస్తారు. అయితే ఏ పండు ఎలాంటి పరిస్థితుల్లో ఎక్కువ ప్రయోజనం ఇస్తుందో తెలుసుకోవడం అవసరం. అసలు వేసవిలో బ్లోటింగ్ ఎందుకు ఎక్కువ అవుతుంది? అలాంటి సమయంలో ఏ పండును తీసుకోవడం ద్వారా చక్కటి ఫలితాలను పొందవచ్చు .. అన్న వివరాలను వైద్యులు వివరిస్తున్నారు. వేసవి కాలంలో అధిక చెమట వల్ల శరీరంలో నీటి లోపం ఏర్పడుతుంది. దీని ప్రభావం జీర్ణవ్యవస్థపై పడుతుంది. నీరు తక్కువగా ఉండటం వల్ల ఆహారం సరిగా జీర్ణం కాక పొట్ట ఉబ్బరం సమస్య వస్తుంది. అలాగే వేసవిలో ఎక్కువగా పండ్లు తినడం, ఒకేసారి అధిక మోతాదులో తీసుకోవడం కూడా గ్యాస్, ఫెర్మెంటేషన్‌కు (పులవడం) దారితీస్తుంది. వేడి కారణంగా జీర్ణక్రియ మందగించడం కూడా మరో కారణంగా ఉంటుంది. సాధారణంగా బొప్పాయిలో పపైన్ అనే జీర్ణ ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను



విభజించి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. అందువల్ల పొట్టలో భారంగా అనిపించడం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. బొప్పాయి తేలికగా జీర్ణమయ్యే పండు. ఇందులో తక్కువ ఆమ్లత్వం ఉండటం వల్ల సున్నితమైన జీర్ణాశయం ఉన్నవారికి కూడా అనుకూలంగా ఉంటుంది. అలాగే ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గించి, పొట్ట సాఫీగా పనిచేయడానికి సహాయ పడుతుంది.

అలాగే అనాసపండులో బ్రోమెలైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది కూడా ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మాంసాహారం లేదా అధిక ప్రోటీన్ ఉన్న ఆహారం తిన్న తర్వాత తీసుకుంటే జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అయితే అనాసపండులో సహజ ఆమ్లత్వం ఎక్కువగా ఉంటుంది. అలాగే చక్కెర శాతం కూడా కొంత ఎక్కువగా ఉండటం వల్ల సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో గ్యాస్, కడుపు మంట, బ్లోటింగ్‌ను మరింత పెంచే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇక ఈ పండ్ల మధ్య ముఖ్య తేడాలను గమనించిట్లయితే బొప్పాయిలోని పపైన్ సాధారణ జీర్ణక్రియను సాఫీగా ఉంచడంలో సహాయపడుతుంది. అనాసలోని బ్రోమెలైన్ మరింత శక్తివంతంగా పనిచేసి గట్టి ప్రోటీన్లను విభజిస్తుంది. బొప్పాయి తక్కువ ఆమ్లత్వం కలిగిన పండు. అనాసపండు సహజంగా ఆమ్ల గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది. అదే విధంగా బొప్పాయిలోని ఫైబర్ పొట్టకు మృదువుగా పనిచేస్తుంది. అనాసలో కొంత ఎక్కువ ఇన్సోల్యూబుల్ ఫైబర్ ఉండటంతో కొందరిలో గ్యాస్ సమస్య పెరుగుతుంది. సున్నితమైన జీర్ణాశయం లేదా ×దీూ సమస్య ఉన్నవారికి బొప్పాయి ఎక్కువగా అనుకూలంగా భావిస్తారు. అనాసపండు కొందరిలో జీర్ణాశయం గోడలకు చికాకు కలిగించే అవకాశం ఉంటుంది. అలాగే భారీగా భోజనం చేసిన తర్వాత వచ్చే భారంగా అనిపించే బ్లోటింగ్‌కు బొప్పాయి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తిన్న తర్వాత అనాసపండు కొద్దిమోతాదులో తీసుకుంటే సహాయపడుతుంది. ×దీూ లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు బొప్పాయిని ఎంచుకోవడం మంచిదిగా భావిస్తున్నారు. యాసిడ్ రిఫ్లక్స్ లేదా కడుపుమంట సమస్య ఉన్నవారు అనాసపండును తగ్గించడం మంచిది. పండ్లు ఆరోగ్యకరమైనవే అయినా, అధిక మోతాదులో తీసుకుంటే సమస్యలు వస్తాయి. ముఖ్యంగా వేసవిలో కేవలం పండ్లతోనే భోజనం చేయడం లేదా ఒకేసారి ఎక్కువగా తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. అందువల్ల పరిమిత మోతాదులో తీసుకోవడం అవసరం. బ్లోటింగ్ సమస్యను తగ్గించడంలో బొప్పాయి సాధారణంగా సురక్షితమైన, జీర్ణాశయానికి మృదువైన ఎంపికగా భావిస్తున్నారు. అనాసపండు కూడా జీర్ణక్రియకు సహాయపడినా, అది ప్రతి ఒక్కరికీ సరిపోవచ్చు అనడం కష్టం. వ్యక్తిగత జీర్ణవ్యవస్థ, ఆహార అలవాట్లు, ఆరోగ్య పరిస్థితులను బట్టి ఈ పండ్ల ప్రభావం మారవచ్చు. కాబట్టి తరచూ బ్లోటింగ్ సమస్య ఉంటే పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# వీవోఏ నియామకాల్లో జాప్యం ఎందుకు?

## ఎదురుచూపుల్లో మహిళా సంఘాలు..



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో మహిళా సంఘాలకు అన్ని విధాలా తోడ్పాటు నిచ్చేందుకు ప్రభుత్వం గ్రామ సంఘ సహాయకురాల (వీవోఏ) నియామకానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఈ ఏడాది మొదట్లోనే విడుదల చేసింది. కానీ ఆ ప్రక్రియ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో మహిళా సంఘాలు వాటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి. జిల్లాలో 567 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. 19,957 వరకూ మహిళా సంఘాలు ఉన్నాయి. వాటిల్లో 2,22,104 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారికి గ్రామైక్య సంఘాల వీవోఏల ద్వారా బ్యాంక్ లింకేజీలు, ఉన్నతి, స్త్రీనిధి వంటి రుణాలు ఇప్పించడం, అవసరమైన బుక్కుల్లో తీర్మానాలు రాయడం వంటి 15 రకాల సేవలు అందిస్తున్నారు. అయితే గ్రామాల్లో మహిళా సంఘాలు ఎక్కువవడంతో వీవోఏలపై పనిభారం పెరిగింది. దీంతో ప్రభుత్వం ఆదేశిస్తున్న కొన్ని కార్యక్రమాలను సకాలంలో చేయలేకపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర సర్కారు.. 30 మహిళా సంఘాలకు ఒక వీవోఏను నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు ఏపీఎం పర్యవేక్షణలో మండల సమాఖ్యలో సీసీలు, గ్రామ సంఘ అధ్యక్షులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామైక్య సంఘాలను విభజించి... తీర్మానాలు రాసి జిల్లా సమాఖ్యకు పంపించారు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు రాలేదు. దీంతో గతంలో ఉన్న గ్రామ వీవోఏలు ఒత్తిడికి గురవుతున్నారు. గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాల పని అంతా వారే చేసుకోవాల్సి వస్తోంది. ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి వస్తోంది. ప్రస్తుతంజిల్లాలో గ్రామైక్య సంఘాలు 567 ఉండగా.. అదనంగా 58 వరకు ఏర్పడ్డాయి. అంటే 58 వీవోఏలను నియమించాల్సి ఉంది. కానీ నియా మకంలో జాప్యం జరుగుతుండడంతో అటు గ్రామైక్య సంఘాలు, ఇటు మహిళా సంఘాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల 561 మంది వీవోఏలకు కొత్తగా సెల్‌ఫోన్లు ఇచ్చారు. అందులో ఉన్న మహిళా సంఘాల యాప్‌లపై అవగాహన కల్పించారు. కానీ ఈ నూతన వీవోఏల నియా మకం మాత్రం చేపట్టలేదు. ఇదిలా ఉండగా.. పాత గ్రామైక్య సంఘాల్లోని వీవోఏలు మహిళా సంఘాలకు సహకరించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు వచ్చిన తరువాత.. నూతన, పాత గ్రామ సంఘం తీర్మానం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఇనిస్టిట్యూషన్ బిల్డింగ్ (ఐబీ) ఏపీఎంకు సంబంధిత ఏపీఎం పంపిస్తారు. ఆయన వీటిని సెర్ప్‌లో ఉన్న ఐబీ విభాగానికి పంపించాలి. వారు టెక్నికల్ పర్సన్ ద్వారా ఈ నూతన గ్రామ సంఘాలను వెబ్‌లో చేర్పుల జాబితాలో పొందుపరుస్తారు. అక్కడ నూతన సంఘాలకు అనుమతులు లభిస్తుంది. నూతన గ్రామ సంఘాలకు ఒక వీవోఏ అవసరమని బడ్జెట్ ఇవ్వాల్సి ఉంది. అప్పుడు ఫైనాన్స్ అనుమతి ఇవ్వాలి. నిబంధనల ప్రకారం వీవోఏ తీర్మానంలో ఏపీఎం లాగిన్‌లో అప్రూవల్ ఇవ్వాలి. దీనిని సెర్ప్‌లో అనుమతిస్తే వీవోఏకు బడ్జెట్ రిలీజ్ చేయాలి. మరి ఈ ప్రక్రియ అంతా ఎప్పటికి పూర్తవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై వెలుగు ఏపీఎం – బి.శివున్నాయుడు మాట్లాడుతూ 'నూతన గ్రామైక్య సంఘాల ఏర్పాటు, వీవోఏల నియామక విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఇంకా వీవోఏల రిజిస్ట్రేషన్ పత్రాలు రాలేదు. త్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది.' అని తెలిపారు.

# ఇరాన్ పై అమెరికా యుద్ధం ఖర్చు 29 బిలియన్ డాలర్లు'

న్యూయార్క్: ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధోన్మాద దాడులకు పాల్పడిన



అమెరికా అందుకు భారీ మూల్యమే చెల్లించుకుంటోంది. పశ్చిమాసియాలో తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టేసిన అమెరికా ఇప్పుడు తన తీసిన గోతిలో తానే పడ్డ చదంగా భారీస్థాయిలో ఆర్థిక నష్టాలను చవిచూస్తోంది. ఇరాన్ తో యుద్ధం కోసం ఇప్పటి వరకు 29 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు పెంటగాన్ బడ్జెట్ అధికారి, అమెరికా చట్టసభ సభ్యులకు మంగళవారం తెలిపారు. గతంలో అమెరికా కాంగ్రెస్ కు పెంటగాన్ సమర్పించిన 25 బిలియన్ డాలర్ల అంచనా బడ్జెట్ ను కూడా ఇది దాటేయడం గమనార్హం. అయితే ఈ అంచనాలు అమెరికా యుద్ధ విభాగానికి సంబంధించిన తక్కువ స్థాయి ఖర్చులను మాత్రమే చూపుతోందని, మొత్తం వ్యయం ఏకంగా 1 ట్రిలియన్ డాలర్లు నుంచి రెండు ట్రిలియన్ (రూ.లక్ష కోట్ల నుంచి రెండు లక్షల కోట్ల ) వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతు న్నారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను సైతం యుద్ధ ఖర్చులకే మళ్లిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. సంక్షేమ పథకాలకు కోతల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యుద్ధ బడ్జెట్ నిపుణురాలు లిండా బిల్మ్స్ మాట్లాడుతూ, "ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం వల్ల అయిన ఖర్చు రూ. లక్ష కోట్లకు పైనే చేరుకునే అవకాశం ఉందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను" అని అన్నారు. స్వల్పకాలిక, ముందస్తు ఖర్చుల కోసమే రోజుకు సుమారు 2 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతోందని, ఇది కేవలం పైకి కనిపించే ఖర్చు మాత్రమేనని, అసలు ఖర్చులు ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. కాగా, ఇరాన్పై అమెరికా చేపట్టిన సైనిక చర్యకు ఇప్పటి వరకు దాదాపు 29 బిలియన్ డాలర్లు ఖర్చు అయ్యిందని పెంటగాన్ కంప్ట్రోలర్ జే హర్స్ట్ మంగళవారం హౌస్ అప్రోప్రియేషన్స్ కమిటీ విచారణ సందర్భంగా తెలియజేశారు. ?సిఎన్ఎస్ కథనం ప్రకారం, 'అమెరికా యుద్ధ పరికరాల మరమ్మత్తులు, కొత్త ఆయుధాల భర్తీ, యుద్ధరంగంలో ఉన్న సిబ్బందికి అయ్యే సాధారణ కార్యాచరణ ఖర్చుల కారణంగానే ఈ బడ్జెట్ పెరిగింది. అయితే ప్రస్తుతం దీనికి సంబంధించిన సరైన అంచనాలు మాత్రం తమ దగ్గర లేవని పేర్కొంది. అయితే అన్ని ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే అసలు సంఖ్య ఇంకా పెద్దగానే ఉండే అవకాశం ఉందని తెలిపింది. బహుశా ఈ యుద్ధ ఖర్చు 40 నుంచి 50 బిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని ఓ అంచనా వేసింది'.




# కెప్టెన్‌గా సంజు టీమిండియాను ఉత్తమంగా నడిపించగలడు: రవిశాస్త్రి



టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ సంజు శాంసన్ ప్రస్తుతం అద్భుత ప్రదర్శనలతో అదరగొడుతున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026 ట్రోఫీని భారత జట్టు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ మెగా టోర్నీలో అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న సంజు.. ఇప్పటికే రెండు సెంచరీలు చేసి అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంజు శాంసన్ భవిష్యత్తుపై టీమిండియా దిగ్గజం రవి శాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. టీ20 జట్టుకు సంజు కీలక పోటీదారుగా ఉన్నాడని అభిప్రాయపడ్డాడు. 'భారత్ రెండేళ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్ ఆడనుంది. అందుకోసం తప్పకుండా కొత్త సారథిని చూడాల్సిన అవసరం ఉంటుంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ పరంగా జట్టును అద్భుతంగానే నడిపిస్తున్నాడు. కానీ బ్యాటర్‌గా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అయితే వచ్చే ప్రపంచ కప్‌కు సూర్య కెప్టెన్‌గా కొనసాగడంపై సందిగ్ధత నెలకొంది. ఈ జాబితాలో సంజు శాంసన్ ముందుంటాడు. ఇప్పటికే అతడికి రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించిన అనుభవం ఉంది. ఓపెనర్‌గా విధ్వంసకర బ్యాటింగ్ చేసే సంజు.. కెప్టెన్‌గానూ జట్టును ఉత్తమంగా నడిపించగలడు. వచ్చే రెండేళ్లలో అతడి నుంచి అత్యుత్తమ ఆటతీరును చూడబోతున్నాం' అని రవిశాస్త్రి తెలిపాడు. 'సంజు శాంసన్ బ్యాటింగ్‌లో నిలకడ ఉండదని చాలామంది భావిస్తారు. గతంలో అతడికి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదని చెబుతుంటారు. కానీ, ఆటతీరు పరంగా అతడి విషయంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. కొన్నిసార్లు అనుకున్నంత స్థాయిలో ఆడలేకపోయినా.. అతడి నైపుణ్యం అద్భుతం. టీ20 ప్రపంచ కప్ 2026లో ఒంటిచేత్తో మ్యాచ్‌లు గెలిపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. తన ఆటతో కెప్టెన్సీ పోటీలో ఉన్నానని చెప్పకనే చెప్పాడు' అని రవి శాస్త్రి వెల్లడించాడు.

## రాణించిన తిలక్ వర్మ, శార్దూల్


# ముంబై ఇండియన్స్ ఘన విజయం




ఒకటా.. రెండా వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో ఓటమి లేకుండా (ఒక మ్యాచ్ రద్దు) దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్ పరిస్థితి దయనీయంగా మారింది. అందరికంటే ముందు ప్లేఆఫ్స్‌కు వెళ్తుందనుకున్న జట్టుకు ఇప్పుడు ఆ అవకాశమే ప్రమాదంలో పడింది. మ్యాచ్‌లో తిలక్ వర్మ (33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 నాటౌట్) అదరగొట్టడంతో పంజాబ్‌పై ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. శ్రేయాస్ సేనకిది వరుసగా ఐదో ఓటమి. దీంతో 13 పాయింట్లతో ఉన్న ఈ జట్టు చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా.. చెన్నై, రాజస్థాన్‌లతో గట్టి పోటీ ఎదురుకానుంది. టాస్ కోల్పోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 200 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ (32 బంతుల్లో 57), ఒమర్జాయ్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38), ప్రియాన్ష్ (17 బంతుల్లో 22) రాణించారు. పేసర్ శార్దూల్‌కు నాలుగు, దీపక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసి గెలిచింది. రికెల్టన్ (23 బంతుల్లో 48), విల్ జాక్స్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25 నాటౌట్) వేగం చూపారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు. అలాగే ముంబై జట్టుకు బుమ్రా తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించడం విశేషం. భారీ ఛేదనలో ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ (25) శుభారంభం అందించగా.. చివర్లో తిలక్ ఒత్తిడిని అధిగమిస్తూ జట్టుకు చక్కటి విజయాన్నందించాడు. స్వల్ప వ్యవధిలో రికెల్టన్, నమన్ (9)లతో పాటు రోహిత్ వెనుదిరగడంతో 88/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో తిలక్ వర్మ రూథర్‌ఫోర్డ్ (20)తో కలిసి నాలుగో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. 18వ ఓవర్‌లో తిలక్ 6,4,6తో 22 పరుగులు రావడంతో సమీకరణం 6 బంతుల్లో 15 పరుగులకు మారింది. జాక్స్ 4, తిలక్ 6,6తో మరో బంతి ఉండగానే మ్యాచ్ ముగిసింది. పంజాబ్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ రాణించినా.. ముంబై పేసర్ల ధాటికి మిడిలార్డర్ తడబడింది. ముఖ్యంగా శార్దూల్ జట్టును కుదురుకోనీయలేదు. కానీ డెత్ ఓవర్లలో ముం బై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. టెయిలెండర్ల హిట్టింగ్‌తో జట్టు స్కోరు 200కి చేరింది. దీనికితోడు ముంబై ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసివచ్చింది. ఇక రెండో ఓవర్‌లోనే వెనుదిరగాల్సిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ మరో ఓపెనర్ ప్రియాన్ష్‌తో కలిసి తను తొలి వికెట్‌కు 52 పరుగులు జోడించాడు. కానీ ప్రియాన్ష్‌ను పేసర్ చాహర్ బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో 55/1 స్కోరుతో నిలిచింది. స్పిన్నర్ రఘు ఓవర్‌లో రెండు, బాష్ ఓవర్‌లో ఓ సిక్స్ బాదిన ప్రభ్‌సిమ్రన్ 29 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే 12వ ఓవర్‌లో ప్రభ్‌తో పాటు కెప్టెన్ శ్రేయాస్ (4)ను అవుట్ చేసిన పేసర్ శార్దూల్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. ఆ తర్వాత కూడా కూపర్, శార్దూల్ చెలరేగడంతో మొత్తంగా 40 పరుగుల తేడాతో ఆరు వికెట్లను కోల్పోయింది. ఈ స్థితిలో 140/7 స్కోరుతో నిలిచిన పంజాబ్‌కు 180 కూడా కష్టమే అనిపించింది. కానీ చివరి 3 ఓవర్లలో సీన్ మారిపోయింది. 18వ ఓవర్‌లో ఒమర్జాయ్ 4,6,6 బాది అవుటయ్యాడు. ఆ ఓవర్‌లో 19 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లో విష్ణు (15 నాటౌట్), బార్ట్‌లెట్ (18 నాటౌట్) ధాటికి 22 రన్స్ వచ్చాయి. బుమ్రా ఆఖరి ఓవర్‌లో 12 రన్స్ రాగా పంజాబ్ ఒక్కసారిగా భారీ స్కోరందుకుంది.




# మహేష్‌బాబు బాలీవుడ్‌లో నటించకపోవడానికి అసలు కారణం ఇదే..



టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్ బాబు బాలీవుడ్ ఎంట్రీపై గతంలో చేసిన 'బాలీవుడ్ నన్ను భరించలేదు' అనే వ్యాఖ్య ఎంతటి చర్చకు దారితీసిందో తెలిసిందే. తాజాగా ఈ అంశంపై నటుడు రాహుల్ దేవ్ స్పందించారు. మహేష్ బాబుకు హిందీ భాష రాకపోవడం వల్లే ఆయన బాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్నారని సరదాగా వ్యాఖ్యానించారు. ఇటీవల ఓ హిందీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాహుల్ దేవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహేష్ వ్యాఖ్యపై అడిగిన ప్రశ్నకు ఆయన నవ్వుతూ, "ఆయనకు భాష రాదు, అందుకే బాలీవుడ్ లో నటించడంలేదు... నిజం అదే" (ఉన్‌కో జుబాన్ నహీ ఆతి, సహీ బాత్ తో యే హై) అని అన్నారు.

కొన్నేళ్ల క్రితం 'మేజర్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మహేష్ బాబు తన బాలీవుడ్ ఎంట్రీపై స్పందించారు. "నాకు హిందీలో చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ వాళ్లు నన్ను భరించలేరని అనుకుంటున్నాను. నా సమయాన్ని వృథా చేసుకోవాలనుకోవడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తనకు తెలుగు సినిమా పరిశ్రమలో లభిస్తున్న స్టార్‌డమ్, ప్రేమతో సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తన తదుపరి చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. 'వారణాసి' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా కీలక పాత్రలు పోషించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# అమీర్ ఖాన్ '3 ఇడియట్స్-2' వస్తోంది.. కథపై సస్పెన్స్!



భారతీయ సినీ చరిత్రలో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిపోయిన బాలీవుడ్ చిత్రం '3 ఇడియట్స్' సీక్వెల్‌పై ఎప్పటినుంచో నడుస్తున్న ఊహాగానాలకు తెరపడింది. ఈ సినిమా సీక్వెల్ పనులను బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్ అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో కూడా ఒరిజినల్ త్రయం ఆమిర్ ఖాన్, ఆర్. మాధవన్, శర్మన్ జోషి తమ పాత్రలను తిరిగి పోషించనుండటం విశేషం.

ఫిల్మ్ ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సీక్వెల్ కథలో ఒక భారీ టైమ్ లీప్ ఉండనుంది. అంటే, 2009 నాటి సినిమాలో కనిపించిన పాత్రల జీవితంలోని మరో దశను ఇందులో చూపించబోతున్నారు. అయితే, ఈ కథలో అతిపెద్ద ట్విస్ట్ ఏంటంటే.. ఈ కథ మొదటి భాగం తర్వాత కొనసాగుతుందా లేక దానికంటే ముందు జరిగిన కథా (ప్రీక్వెల్) అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. ఈ కథాంశం గురించిన పూర్తి వివరాలు ప్రస్తుతం ఆమిర్ ఖాన్‌కు మాత్రమే తెలుసని చెబుతున్నారు.

2009లో రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో వచ్చిన '3 ఇడియట్స్' ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించి, రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆమిర్ ఖాన్ పోషించిన 'రాంచో' పాత్ర ఇండియన్ సినిమాలో ఐకానిక్‌గా నిలిచిపోయింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్, బోమన్ ఇరానీ, మోనా సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు సీక్వెల్‌కు కూడా రాజ్‌కుమార్ హిరాణీనే దర్శకత్వం వహించే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి.




# తెలుగు యువ దర్శకుడితో టామ్ క్రూజ్ భారీ చిత్రం!



హాలీవుడ్ యాక్షన్ స్టార్ టామ్ క్రూజ్ తన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. 'మిషన్ ఇంపాజిబుల్' వంటి భారీ ఫ్రాంచైజీకి ముగింపు పలికిన ఆయన, ఇప్పుడు 'డూపెల్‌గాంగర్' అనే ఇంట్రెస్టింగ్ స్పై థ్రిల్లర్‌తో అలరించబోతున్నారనేలా అంతర్జాతీయ మీడియాలో వార్తలు హైలెట్ అవుతున్నాయి. విశేషం ఏమిటంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మన తెలుగు మూలాలున్న యువ దర్శకుడు అనీష్ చాగంటి తెరకెక్కించనుండటం. 2018లో వచ్చిన 'సెర్చింగ్' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అనీష్, ఇప్పుడు హాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్‌ను డైరెక్ట్ చేసే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నట్లుగా టాక్ నడుస్తోంది. 27 ఏళ్ళ వయసులోనే ఒక సినిమా తీసి సూపర్ హిట్ కొట్టి 75 మిలియన్ డాలర్ల వసూళ్లు రాబట్టిన అనీష్ చాగంటి తెలుగువాడు కావడం విశేషం.

అనీష్ చాగంటి దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న 'డూపెల్‌గాంగర్' చిత్రంలో టామ్ క్రూజ్ ద్విపాత్రాభినయం చేయబోతున్నట్లు సమాచారం. ఆయన ఇందులో 'వీర్' అనే సీఐఏ ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారని.. రష్యా ఇంటెలిజెన్స్ సంస్థ తనను పోలిన వ్యక్తిని తయారు చేసిందని తెలుసుకున్న తర్వాత ఆ ఏజెంట్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా ఉండబోతోందని తెలుస్తోంది. వింటేజ్ టామ్ క్రూజ్ శైలిలో సాగే ఈ స్పై థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు ర్యాన్ కూగ్లర్, జింజీ కూగ్లర్, సెవ్ ఒహానియన్‌లతో కలిసి అనీష్ చాగంటి స్వయంగా నిర్మిస్తున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

టామ్ క్రూజ్ ప్రస్తుతం 'ద ఫైనల్ రికనింగ్' షూటింగ్‌ను పూర్తి చేసుకునే పనిలో ఉన్నారు. మరోవైపు, ఈ ఏడాది చివర్లో ఆయన నటించిన 'డిగ్గర్' అనే సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతోంది. అనీష్ చాగంటి విషయానికి వస్తే.. ఆయన తల్లిదండ్రులు 1980వ దశకంలో ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు వెళ్లారు. షార్ట్ ఫిల్మ్స్‌తో మొదలై.. హాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తున్న అనీష్, ఇప్పుడు టామ్ క్రూజ్ వంటి సెన్సేషనల్ స్టార్‌ను డైరెక్ట్ చేయనుండటం తెలుగు వారికి గర్వకారణమనే చెప్పుకోవాలి. చూద్దాం మరి.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో..?

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**